## పచ్చజెండా ఊపి.. రైలులో ప్రయాణించి..

సిద్దిపేట ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. సిద్దిపేట-సికింద్రాబాదు వరకు రైలు ఏర్పాటు చేశారు. దీనిని మంగళవారం మంత్రి హరీశ్‌రావు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆయన దుద్దెడ వరకు ప్రయాణించారు. రైలు నుంచి ప్రజలకు అభివాదం తెలిపారు.


దుద్దెడ రైల్వేస్టేషన్‌లో మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు


రైలు నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు


రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సందడి

# మా పాలనలో మహర్దశ

- గ్రామాలు, కుల సంఘాలు అభివృద్ధి
- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి


దౌల్తాబాద్‌లో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలు, కుల సంఘాలకు మహర్దశ పట్టిందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొనాయిపల్లిలో పలు అభివృద్ధి పనులపై గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి గ్రామస్తులతో కలిసి చర్చించారు. అనంతరం గోవిందాపూర్‌లో బోయ సంఘం భవనం, గువ్వలేగిలో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలు వచ్చే ఎన్నికల్లో పనిచేసే నాయకుడికి పట్టంగట్టాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని వారికి తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరి సంధ్య, జెడ్పీటీసీ రనం జ్యోతి, వైస్ ఎంపీపీ అల్లి శేఖర్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పూజిత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మల్లేశం, అల్లి లత మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

**సేవచేసే నాయకుడిని ఎన్నుకోవాలి**

మహిళలకు పావలా వడ్డీకే రుణాలు అందించి సంఘాలకు భవనాలను నిర్మిస్తామని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వీఆర్ఆర్ గార్డెన్‌లో మహిళా సంఘాల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు పక్కా భవనాలు నిర్మిస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను చట్ట సభలకు పంపిస్తే వారు ప్రజల కోసం పని చేస్తారన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ మనోహర్‌రావు, ఆత్మకమిటీ చైర్మన్ భాస్కరాచారి, ఎంపీపీ గంగాధరి సంధ్య, జెడ్పీటీసీ రణంజ్యోతి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పూజిత, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దేవేందర్, ఏపీఎం కిషన్, సీసీలు, వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌కు గెలుపు గ్యారంటీ లేదు.. బీజేపీకి జన బలం లేదు**

మిరుదొడ్డి(దుబ్బాక): వచ్చే ఎన్నికల కోసం గ్యారంటీ కార్డుతో ప్రజల ముందుకు వచ్చే కాంగ్రెస్ పార్టీకే గెలుపు గ్యారంటీ లేదనీ, బీజేపీకి జన బలమే లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలను ఆవిష్కరించడంతో పాటు, బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయాన్ని మంగళవారం రాత్రి ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు ఆయనకు నాగలిని బహూకరించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ అమర వీరుల త్యాగ ఫలితాలు సువర్ణాక్షరాలతో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు బొంపెల్లి మనోహర్ రావు, తోట కమలాకర్‌రెడ్డి, ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు తదితరులు పల్గొన్నారు.

## 'మా భూమి మాకే ఇవ్వాలి'

తహసీల్దార్‌కు దళితుల వినతి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాయపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 81లో ఉన్న ఎకరం భూమి దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొని అందులో పల్లె ప్రకృతి వనం నిర్మించారని, తమ భూమి తమకు ఇవ్వాలని 20 మంది దళితులు తహసీల్దార్ అనంతరెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం ఎకరం భూమి కేటాయించిదన్నారు. ఆ భూమిని తీసుకొని తమకు మరోచోట స్థలం ఇచ్చి ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పి కాలయాపన చేస్తుండటంతో విసిగెత్తి పల్లె ప్రకృతి వనాని కూల్చి అందులో గుడిసెలు వేసుకున్నామని వినతి పత్రంలో వివరించారు. అయితే పంచాయతీ కార్యదర్శి తమపై పల్లె ప్రకృతి వనం ధ్వంసం చేశారని కేసు పెట్టారని వాపోయారు. ఈ విషయంపై విచారణ చేసి తమ భూమి తమకే చెందేలా చూడాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు దళితులకు మద్దతు తెలిపారు. కార్యక్రమలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొంగొని సురేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు జీవన్‌రెడ్డి, భద్రప్ప, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్అండ్ఆర్ కాలనీవాసుల ఆగ్రహం

ములుగు(గజ్వేల్): తమ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండలంలోని బహిలంపూర్ ఆర్అండ్ఆర్ కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కాలనీలో గ్రామ పంచాయతీ కార్యాలయ భవన ప్రారంభోత్సవానికి మంత్రి హరీశ్‌రావు వచ్చి వెళ్లిన తర్వాత కాలనీ వాసులు తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. ఎంతో కాలంగా మిగిలిపోయిన ప్యాకేజీలు, నష్టపరిహారం పంపిణీలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తే తమను అడ్డుకున్నారన్నారు. వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్ జోక్యం చేసుకుని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నిర్వాసితులకు నచ్చజెప్పారు.

## మహిళల ఆరోగ్యానికి రుతుప్రేమ

మున్సిపల్ చైర్మన్ మంజుల



సిద్దిపేటజోన్: మహిళల ఆరోగ్యం కోసమే రుతుప్రేమ ప్రవేశపెట్టినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తెలిపారు. మంగళవారం ఆయా వార్డు మహిళలకు రుతుప్రేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటలో రుతుప్రేమ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, కౌన్సిలర్లు సుందర్, ప్రవీణ్, సాయి, తస్లీమ్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


బెజ్జంకిలో గృహలక్ష్మీ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. బెజ్జంకి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, యువకులకు క్రికెట్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మహిళలు, రైతులు, కులవృత్తుల కోసం చేపట్టిన పథకాలను వివరించారు. మొదటి విడతలో గృహలక్ష్మి ఇల్లు, దళితబంధు పథకాలను ఇప్పుడు ఇస్తున్నామని, అర్హులకు విడతల వారీగా అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసం మోసపూరిత హామీలతో మభ్యపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమాలలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, ఎంపీడీఓ దమ్మని రాము, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ద్యావనపెల్లి మంజుల, చింతలపెల్లి సంజీవరెడ్డి, గుభిరె శారద, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ మానకొండూర్ అభ్యర్థిగా రామచంద్రం

బెజ్జంకి(సిద్దిపేట): బీఎస్పీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మండలంలోని చిలాపూర్ గ్రామానికి చెందిన ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ నిశాని రామచంద్రంను ఎంపిక చేసినట్లు బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ శ్రీరామ్‌జీ గౌతం మంగళవారం తెలిపారు. ఈయన గత ఎన్నికలలో బీఎస్పీ మానకొండూర్ అభ్యర్థిగా పోటీ చేశారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్


విద్యార్థులకు బ్యాగ్, స్టడీ మెటీరియల్ అందిస్తున్న సర్పంచ్ పర్శరాములు

సిద్దిపేటరూరల్: విద్యార్థులు నేషనల్ మెరిట్ కం మీన్స్ పరీక్షల్లో ప్రతిభ చూపి ఉపకార వేతనం పొందాలని సర్పంచ్ పర్శరాములు అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండల పరిధి జక్కాపూర్‌లో 8వ తరగతి విద్యార్థులకు యూత్ ఫర్ సేవా స్వచ్ఛంధ సంస్థ సహకారంతో అందిస్తున్న స్టడీ మెటీరియల్, బ్యాగ్‌లను సర్పంచ్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మూడేళ్లుగా విద్యార్థులు జిల్లా స్థాయిలో జాతీయ ఉపకార వేతన ప్రతిభ పరీక్షా ఉత్తమ ప్రతిభ కనబర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు. డిసెంబర్‌లో జరిగే పరీక్షల్లోనూ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మ, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏఐకేఎస్ నాయకులు

సిద్దిపేటఅర్బన్: రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ లఖీంపూర్ ఖేరీలో నిరసన తెలుపుతున్న రైతుల మృతికి కారణమైన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మంత్రిని బర్తరఫ్ చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన బ్లాక్ డే పిలుపు మేరకు మంగళవారం సిద్దిపేటలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, జిల్లా కమిటీ సభ్యురాలు శిరీష, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


కొమురవెల్లిలో నినాదాలు చేస్తున్న రైతు సంఘం నాయకులు

కొముురవెల్లి(సిద్దిపేట): రైతాంగానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బద్దిపడగ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు వ్యతిరేక నల్లా చట్టాలను రద్దు సందర్భంగా పార్లమెంట్‌లో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ,రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, అయినాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ అధికారికి సన్మానం

సిద్దిపేటఎడ్యుకేషన్: మూడు నెలల పీఆర్‌సీఎస్ శిక్షణను పూర్తి చేసుకుని లెఫ్టినెంట్ హోదా పొందిన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల ఎన్‌సీసీ అధికారి మహేందర్‌రెడ్డిని మంగళవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ గోపాల సుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ అయోధ్యరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిక

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లి సర్పంచ్ పల్లె సుగుణ బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంగళవారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. ఎమ్మెల్యే రఘునందన్‌రావు నియోజకవర్గానికి చేసిందేమి లేదని విమర్శించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రూరల్ సీఐ చేరాలు

సిద్దిపేటరూరల్: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ చేరాలు హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని ఇర్కోడ్‌లోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బాలికల, మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులకు వ్యక్తిగత వివరాలు చెపొద్దన్నారు. ఎవరైన వేధిస్తే వెంటనే డయల్ 100, సిద్దిపేట షీటీమ్ వాట్సాప్ నంబర్ 8712667434, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, మహిళా పోలీస్ స్టేషన్ 8712667435 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి హెడ్మాస్టర్ సుమలత, ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీమ్ సిబ్బంది కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్పొరేటీకరణ తగదు

మద్దూరు(హుస్నాబాద్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను మానుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా ఎస్‌కేఎస్ పిలుపు మేరకు అక్టోబర్ 3 బ్లాక్ డేను సీఐటీయూ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. విద్యుత్ కార్పొరేటీకరణను ఉపసంహరించుకోవాలన్నారు.

## 7న అలంపూర్ - హైదరాబాద్ పాదయాత్ర

సిద్దిపేటకమాన్: వచ్చే శీతకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7వ తేదీన అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు మందకృష్ణ చేయనున్న మహాపాదయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ నాయకులు పిలుపు ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లింగం, శంకర్, రాజు, నవీన్, మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపకార వేతన బకాయి విడుదల చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యమంలో మండల అధ్యక్షుడు సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా వినాయక నిమజ్జనోత్సవం


వినాయక శోభాయాత్ర


నృత్య కళాకారులు

దుబ్బాక: పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవం నేత్రపర్వంగా సాగింది. సోమవారం రాత్రి ప్రారంభమైన నిమజ్జనం ఊరేగింపు మంగళవారం సాయంత్రం వరకు కొనసాగింది. 60 విగ్రహాలను పట్టణంలోని పుర వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి దుబ్బాక పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. శోభాయాత్రలో మహిళల కొలాటాలు, యువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర మంతా తొమ్మిది రోజులు జరిపుకునే వినాయక నవరాత్రులు దుబ్బాకలో 13 రోజులకు పైగా జరుపడం విశేషం.

## సంక్షిప్త వార్తలు

**◆ మంత్రిని అడ్డుకుంటాం**

అక్కన్నపేట(హుస్నాబాద్): తెలంగాణ గిరిజనాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ బుధవారం అక్కన్నపేటలో పాల్గొనన్ను బహిరంగ సభలో అడ్డుకుంటామని కపూర్‌నాయక్ తండా గ్రామ సర్పంచ్ భానోతు సంతోష్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రచారాలకు ఇచ్చే ప్రాధాన్యత ప్రజా సమస్యల పరిష్కారంపై చూపడంలేదన్నారు. ఒకవైపు గౌరవెల్లి భూ నిర్వాసితుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉంటే మరోపక్క నందారం, కపూర్‌నాయక్‌తండా గ్రామాల్లో 932 ఎకరాల వ్యవసాయ భూమి ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో ఉందన్నారు.

**◆ నేడు మంత్రి పర్యటన**

హుస్నాబాద్: పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పర్యటించనున్నారు. హుస్నాబాద్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాల, కళాశాలను ప్రారంభిస్తారు. తర్వాత గిరిజన బంజార భవనం పనులను పరిశీలిస్తారు. ఆ తర్వాత జిల్లెలగడ్డ గ్రామంలో తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాల (బాలురు) ప్రారంభోత్సవం, అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.

**◆ ప్రభుత్వం డివిజన్ ప్రకటన చేయాలి**



చేర్యాల(సిద్దిపేట): చేర్యాల డివిజన్ సాధనకు జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షపై ప్రభుత్వం స్పందించి వెంటనే రెవెన్యూ డివిజన్ ప్రకటన చేయాలని కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ గిరి కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. డివిజన్ సాధన దీక్ష 23వ రోజుకు చేరిన సందర్భంగా టెంట్ హౌస్ అసోసియేషన్ సభ్యులు దీక్షలో కూర్చున్నారు. వారికి ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం చేర్యాల డివిజన్ ఏర్పాటు అన్నారు. ప్రభుత్వం స్పందించి డివిజన్ ప్రకటన చేయాలన్నారు.

**◆ 2వ ఏఎన్ఎంల అరెస్ట్**

చేర్యాల(సిద్దిపేట): తమ సమస్యల పరిష్కారం కోసం 2వ ఏఎన్ఎంలు చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టారు. మంగళవారం పట్టణం నుంచి 2వ ఏఎన్ఎంలు హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో కరుణ, సుహాసిని, అన్నపూర్ణ, గీత ఉన్నారు.

**◆ ఎంపీపీకి పితృవియోగం**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస తండ్రి భూక్య బీలా (80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. అక్కన్నపేట జెడ్పీటీసీ భూక్య మంగ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జిల్లెలగడ్డలో ఎంపీపీని పరామర్శించి తమ సంతాపం తెలిపారు.

## ఐఆర్ ప్రకటనపై నిరసన


నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

హుస్నాబాద్: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్కువ ఐఆర్ ప్రకటించినందుకు నిరసనగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పునరాలోచన చేసి ఐఆర్‌ను 15 శాతం పెంచాలన్నారు. అలాగే ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం వాసుదేవ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మధ్యంతర భృతిపై పునఃపరిశీలించాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లు, ఉద్యోగులకు ప్రకటించిన మధ్యంతర భృతి (ఐఆర్)ని పునఃపరిశీలించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అమ్మన చంద్రారెడ్డి మంగళవారం కోరారు. ఐఆర్‌ను 5శాతం ప్రకటించడం సరికాదని, కనీసం పది శాతం ప్రకటించాలన్నారు.

## క్లుప్తంగా

### నవీన్ కుమార్‌కు సేవారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న నవీన్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తన సేవలను గుర్తించి జాతీయ మహాత్మా గాంధీ శాంతి సేవా రత్న అవార్డుతో పాటుగా గౌరవ డాక్టరేట్‌ను హైదరాబాద్ మనం ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అందజేసినట్లు శ్రీ సంతోషిమాత ఆలయ చైర్మన్ మాంకాల నవీన్‌కుమార్ మంగళవారం తెలిపారు. అవార్డు, డాక్టరేట్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మనం ఫౌండేషన్ నిర్వాహకుడు చక్రవర్తి, మల్కాజ్‌గిరి కోర్టు న్యాయవాది బూర్గుల మధుసూదన్ రావు, సముద్రాల వేణుగోపాల చారి, దైవజ్ఞ శర్మ, డాక్టర్ చౌదరి వడ్లపల్ల, డాక్టర్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నట్లు చెప్పారు.

### రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత

హుస్నాబాద్: 2023-24 సంవత్సరానికి సిద్దిపేటలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో హుస్నాబాద్ పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్ పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో సర్ సీవీ రామన్ ఉన్నత పాఠశాల విద్యార్థి బంటు రీశేంద్ర, తెలంగాణ మైనార్టీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలకు చెందిన షేక్ హసీనా అండర్-17 విభాగంలో హైజంప్, షాట్‌పుట్‌లో నాలుగు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ఇదే పాఠశాలకు చెందిన ఎండీ సాజీరా అండర్-14 విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై విద్యార్థులను మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, సీవీ రామన్ పాఠశాల కరస్పాండెంట్ కాయిత నారాయణ రెడ్డి అభినందించారు.

### ఐడీబీఐ ఆవిర్భావ దినోత్సవం


ఐడీబీఐలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరం

గజ్వేల్: ప్రజ్ఞాపూర్ ఐడీబీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వీఎం ఆసుపత్రి, సిద్దిపేట విద్యాభారతి సంస్థ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వినయ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ యామిని, క్యాషియర్ శ్రావణి, సిబ్బంది కరుణాకర్, అంజి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### చట్టసభల్లో స్థానం కల్పించాలి

ముదిరాజ్ జేఏసీ నాయకులు


మాట్లాడుతున్న ముదిరాజ్ జేఏసీ నాయకులు

గజ్వేల్‌రూరల్: ముదిరాజ్‌లకు చట్టసభల్లో జనాభా ప్రతిపాదికన స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గజ్వేల్‌లో నిర్వహించతలపెట్టిన ముదిరాజ్ బీసీ గర్జన ర్యాలీని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ ముదిరాజ్ జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు చట్టసభల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించడం లేదన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు ముదిరాజు బంధు పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కోతుల బెడద భరించలేం

తంగళ్ళపల్లి గ్రామస్తుల గగ్గోలు


తంగళ్ళపల్లిలో కోతుల సమస్యపై చర్చిస్తున్న గ్రామస్తులు

కోహెడరూరల్(హుస్నాబాద్): కోతుల బెడద భరించలేక పోతున్నామని మండలంలోని తంగళ్ళపల్లి గ్రామస్తులు గొగ్గోలు పెడుతున్నారు. కోతులు పంట చేనులను నాశనం చేయడమే కాకుండ ఇళ్లలోకి చొరబడి దాడి చేస్తున్నాయని తమ గోడు చెప్పుకున్నారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు సర్పంచ్ పాము నాగేశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు కోతుల సమస్యపై చర్చించారు. వాటికి హాని తలపెట్టకుండా అడవిలోకి తరలించాలని తీర్మానం చేశారు. కోతుల తరలింపు కోసం ఇంటికి రూ.500 చెల్లించాలని తీర్మానించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990